www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | గురు వారం, 15 డిసెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-210 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## అనైతిక రాజకీయ నాయకుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి !




**నీతిమాలిన రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ కోమటిరెడ్డి. గత మునుగోడు ఉపఎన్నిక నేపథ్యంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యవహరించిన తీరు యావత్ తెలంగాణ ప్రజలకు తెలుసు. తెలంగాణ కాంగ్రెస్‌ను ఎంత డ్యామేజ్ చేయాలో అంత చేశాడు. ఈయనగారు సక్కమైన సుద్దపూస అన్నట్లు చేసిందంతా చేసి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలిసి బొంకుడు మాటలు పలకడం విడ్డూరం. కాంగ్రెస్ బతకాలంటే ఇలాంటి అనైతిక రాజకీయనాయకులుగా వ్యవహరించే రాజకీయ వ్యభిచారులు ఎం.పీ వెంకట్‌రెడ్డిని ప్రజాక్షేత్రం నుంచి వెలివేయాలి అని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారు.**

దివంగత నేత వైఎస్ఆర్ ముఖ్యమంత్రి కాకముందు కోమటిరెడ్డి బ్రదర్స్ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రమే. కాంగ్రెస్ పార్టీ భిక్షతో వివిధ పదవులు కోమటిరెడ్డి బ్రదర్స్ అందిపుచ్చుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాప్రతినిధులుగా ఉంటూనే కాంట్రాక్టర్లుగా అవతారం ఎత్తారు. జలయజ్ఞనం పేరుతో పేదల సొమ్మును విచ్చలవిడిగా దోచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక హోదాలను ఇచ్చి, పదవులను కట్టబెట్టితే కోమటిరెడ్డి బ్రదర్స్ పార్టీకి వెన్నుపోట్లు పొడుస్తూ వస్తున్నారు. మునుగోడు ఉప ఎన్నిక ముందు రాజగోపా ల్‌రెడ్డి తమ స్వార్థపూరిత ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీని వదిలి బీజేపీలో చేరిన సంగతి మనందరికి తెలిసిందే. ఉపఎన్నిక ప్రచార సమయంలో స్టార్ క్యాంపనీర్ హోదాలో ఉండి, అందులో సొంత పార్లమెంటరీ నియోజక వర్గంలో ఎన్నిక జరుగుతున్నా కూడా ప్రచారంకు దూరంగా ఉన్నారు. వెంకట్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి రాకుండా తమ్ముని కోసం ఎలాంటి నాటకాలు, వేశాలు వేశాడో మునుగోడు ప్రజలు గమనించారు. ఇదంతా గమనించిన ఢిల్లీ అదిష్ఠానం కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ కాంగ్రెస్ జంబో నూతన కమిటీలో స్థానం కల్పించలేదు. పలుమార్లు కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించేలా ప్రవర్తించిన వెంకట్‌రెడ్డికి ఈ రూపంలో షాక్ ఇచ్చినట్లు తెలుస్తుంది.



➢ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలిసి తెలంగాణలో రాజకీయ పరిస్థితులు, సీనియర్లు పార్టీని వీడుతుండడంపై చర్చించినట్లు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అరగంటపాటు సమయం ఇచ్చి ఖర్గే అంతా విన్నారు. త్వరలోనే అన్నీ సర్దుకుంటాయని వారు చెప్పరని ఎం.పీ వెంకట్‌రెడ్డి తెలిపారు.

## బాలికపై యాసిడ్ దాడి

### దేశ రాజధానిలో దారుణ ఘటన




**న్యూఢిల్లీ, డిసెబర్ 14 (సమ సమాజం):** దేశ రాజధాని దిల్లీ లో దారుణ ఘటన చోటుచేసుకుంది. 12వ తరగతి చదువుతున్న ఓ బాలికపై ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి యాసిడ్ తో దాడిచేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆ బాలిక ఇప్పుడు ప్రాణాలతో పోరాడుతోంది. దిల్లీలోని ద్వారకా ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. ద్వారకాలోని ఓ ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలిక బుధవారం ఉదయం తన చెల్లితో కలిసి బయటకెళ్లింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చారు. వెనుక కూర్చున్న వ్యక్తి ఆ బాలికపై యాసిడ్ చల్లాడు. ఏం జరిగిందో తెలుసుకునే లోపే నిందితులిద్దరూ అక్కడి నుంచి పారిపోయారు. ముఖానికి చేతులు అడ్డుపెట్టుకుని మంటతో విలవిల్లాడుతూ బాలిక పరిగెడుతున్న దృశ్యం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. వెంటనే స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని బాధితురాలి తండ్రి తెలిపారు. ముఖంపై, కంట్లో

2వ

## హస్తినలో బీఆర్ఎస్

### పార్టీ కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం కేసీఆర్

- కేసీఆర్‌కు అభినందనలు తెలిపిన జాతీయ, రాష్ట్ర నేతలు
- హాజరైన అఖిలేష్ యాదవ్, కుమారస్వామి
- పార్టీ శ్రేణులతో సందడిగా మారిన వాతావరణం
- దేశహితం కోసం కేసీఆర్ నూతన రాజకీయ ఒరవడి
- పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్






**న్యూఢిల్లీ, డిసెబర్ 14 (సమ సమాజం):** దేశ రాజకీయాల్లో అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. దేశంలో గుణాత్మక మార్పు కోసం పాటుపడిన తెలంగాణ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఇవాళ ఢిల్లీలో పార్టీ జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించి, పార్టీ జాతీయ జెండాను కేసీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు జాతీయ, రాష్ట్ర నేతలు అభినందనలు తెలిపారు. అనంతరం రాజశ్యామల యాగం పూర్ణాహుతికి ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులకు వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి హాజరయ్యారు. మరోవైపు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన పార్టీ శ్రేణులు, ముఖ్య నేతలతో సందడి వాతావరణం నెలకొంది. ఢిల్లీలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సీఎం భార్య శోభ, ఎమ్మెల్సీ కవిత, మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, కొప్పుల ఈశ్వర్, ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత, హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి సందడి చేశారు. యాగం ముగిసిన వెంటనే కేసీఆర్ బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేసీఆర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ సందడి నెలకొంది. తెలంగాణ ఉద్యమ పార్టీ టీఆర్ఎస్ జాతీయ పార్టీగా అవతరించింది. బీఆర్ఎస్ పేరుతో జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్రమంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు విస్తరించాలని యోచిస్తున్నారు. ఢిల్లీలో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

2వ

## కాంగ్రెస్ ధర్నా ఉద్రిక్తత

### ప్రగతి భవన్‌ను ముట్టడికి యత్నం

- అడ్డగించిన పోలీసులు.. పలువురు నేతల అరెస్టు
- కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నేతలు
- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు దిగిన పార్టీ శ్రేణులు
- కాంగ్రెస్ పార్టీ డాటాను మొత్తం చోరీచేశారు
- పోలీసుల ముసుగులో రౌడీలతో దాడులు
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆగ్రహం
- నన్నూ అరెస్ట్ చేయండి: మాణిక్కం ఠాకూర్





**హైదరాబాద్, డిసెబర్ 14 (సమ సమాజం):** కాంగ్రెస్ వార్ రూం పై పోలీసుల దాడికి నిరసనగా కాంగ్రెస్ శ్రేణులు ధర్నాకు దిగాయి. గాంధీ భవన్ నుంచి ప్రగతి భవన్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు బయలు దేరారు.గేటు వద్ద

2వ

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆశలు అడియాశలు

- 18 నెలల డీఏ బకాయిల నిలిపివేత
- రాజ్య సభలో స్పష్టం చేసిన ఆర్థిక శాఖ సహాయ మంత్రి

**న్యూఢిల్లీ, డిసెబర్ 14 (సమ సమాజం):** కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు భారీ షాకిచ్చింది. కీలక ప్రటకన చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా డియర్‌నెస్ అలవెన్స్‌పై ఎంతో కాలంగా నెలకొన్న అంచనాలను పటాపంచలు చేసింది. 18 నెలల డియర్‌నెస్ అలవెన్స్ బకాయిలను చెల్లించే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. అంటే ఉద్యోగులకు ఇక ఈ డీఏ రానే రాదు. కరోనా వైరస్ సమయంలో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు డియర్‌నెస్ అలవెన్స్‌ను నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు కరోనా టైమ్‌లో పెండింగ్‌లో ఉన్న డియర్‌నెస్ అలవెన్స్‌ను చెల్లించే ప్రసక్తి లేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ కుండబద్దలు కొట్టేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇది బ్యాడ్ న్యూస్ అని చెప్పుకోవాలి. 2020 జనవరి 1 నుంచి 2021 జూన్ 30 వరకు డియర్‌నెస్ అలవెన్స్ అనేది ఉద్యోగులకు పెండింగ్‌లో ఉంది. కరోనా కారణంగా ప్రభుత్వం డీఏను నిలుపుదల చేసింది. పరిస్తితులు మళ్లీ గాడిలో పడిన తర్వాత ఈ డీఏ బకాయిలు అందుతాయని ఉద్యోగులు భావించారు. అయితే

2వ

## బీఆర్ఎస్ ఒక వైరస్ బీజేపీ ఓ వ్యాక్సిన్

వైరస్ కావాలా వ్యాక్సిన్ కావాలా? ● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



**కరీంనగర్, డిసెబర్ 14 (సమ సమాజం):** 'బీఆర్ఎస్ ఒక వైరస్.. బీజేపీ ఒక వ్యాక్సిన్' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అభివర్ణించారు. వైరస్ కావాలా వ్యాక్సిన్ కావాలా ప్రజలే తేల్చుకోవాలని అన్నారు. తనను ప్రశ్నిస్తూ ఏర్పాటు అయిన ఫ్లెక్సీలపై బండి సంజయ్ స్పందించారు. ఎంపీగా తాను ఏం చేయాలో చేస్తున్నానని, ముందు మీరేం చేశారో చెప్పాలని అన్నారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం తుర్గాసి పల్లి

2వ

## శరవేగంగా నగరాభివృద్ధి

- ఏడాదిన్నర కాలంలో లక్షన్నర ఉద్యోగాల కల్పన
- భారీగా పెరిగిన ఐటీ ఎగుమతులు
- టోమోటివ్ రంగంలో బోష్ మరింత రాటుదేలుతుంది
- అత్యధిక వృద్ధి సాధించిన రాష్ట్రంగా తెలంగాణ
- ఆటోమోటివ్ రంగంలో బోష్ రాణిస్తుందన్న మంత్రి కేటీఆర్
- బోష్ కంపెనీ స్మార్ట్ క్యాంపస్‌ను ప్రారంభించిన మంత్రి




2వ

## సంపాదకీయం

### అపహాస్యం అవుతున్న ప్రజాస్వామ్యం !

దేశంలో రాజకీయాలు మారుతున్నాయి. ఒకే పార్టీ నుంచి ఇప్పుడు అనేక పార్టీల వ్యవస్థ రాజ్యం ఏలు తోంది. గతంలో కాంగ్రెస్ కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ అధికారంలో ఉండేది. అప్పట్లోనే డబుల్ ఇంజిన్ సర్కార్ కాంగ్రెస్ ఏలుబడిలో ఉండేవి. అంతోఇంతో అభివృద్ధి లేకుండా దేశం ముందుకు సాగలేదు. అనేక ప్రాజెక్టులు, పెద్దపెద్ద పరిశ్రమలు అప్పట్లోనే వచ్చాయి. అయితే కొన్ని వర్గాలకు మాత్రమే రాజకీయాల్లో అర్హత ఉండేది. రానురాను ప్రాంతీయ పార్టీల రాకతో భారత్‌లోని అనేక వర్గాలు, కులాలు, మతాలకు ప్రాధాన్యం పెరుగుతూ వచ్చింది. కేంద్రంలో కాంగ్రేసేతర ప్రభుత్వాల యుగం 1977లో ప్రారంభమ యిందని చెప్పాలి. ఎమర్జెన్సీ ముగిసాక జనతా ప్రభుత్వం అధికారంలోకి వస్తే..జనతా ప్రభుత్వం కుప్పకూలాక అనేక ప్రాంతీయ పార్టీలు పుట్టుకుని వచ్చాయి. ప్రజల్లో సహజ సిద్ధంగా ఉండే ప్రభుత్వ వ్యతిరేకత కారణంగానే ప్రాంతీయ పార్టీలు పుట్టుకు వచ్చాయి. గత ఐదున్నర దశాబ్దాలుగా ఎన్నికల ఫలితాలను ప్రాంతీయ పార్టీలు నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తూ వచ్చాయి. కేంద్రంలో కూడా ప్రాంతీయ పార్టీల మద్దతు లేకుండా ప్రభుత్వాలు ఏర్పడని పరిస్థితికి దేశం వచ్చింది. ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కిన ప్రతిసారి ప్రజలు తమదైన రీతిలో గుణపాఠం చెబుతూనే ఉన్నారు. అయినా రాజకీయ వ్యవస్థలో పెద్దగా మార్పులు రావడం లేదు. అధికార పక్షానికి అనేక సమస్యలను సవాళ్లుగా విసురుతోంది. 1967లో భారత జాతీయ కాంగ్రెస్ సర్వాధిపత్యం ముగిసిన తరువాత రాష్ట్రాల్లో అనేక ప్రభుత్వాలు పరాజయం పాలయ్యాయి. ప్రాంతీయ, కాంగ్రేసేతర పార్టీల ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి. ప్రత్యామ్నాయ ప్రభుత్వాలను ఎన్నుకోవడమనేది కేరళలో ఆరంభ మయింది. 1990ల నుంచీ రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులో ప్రత్యామ్నాయ ప్రభుత్వాలు ఏర్పడడాన్ని మనం చూశాము. అయితే ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి వరుసగా మళ్లీ, మళ్లీ అధికారానికి వచ్చిన సమున్నత నాయకులూ ఉన్నారు. అలాగే ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా అనేకలు నేటికీ ప్రతి ఎన్నికల్లో వరుసగా గెలుస్తూనే ఉన్నారు. ఇదంతా వ్యక్తిగతంగా వారికి ఉన్న ప్రతిష్టకు నిదర్శనం గా చూడాలి. కొందరు రాజకీయ నేతలు, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల నేతలు తమ విధానాలతో ప్రజల్లో స్థానం సంపాదించుకున్నారు. అలా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి కాంగ్రెస్ పార్టీని కూకటివేళ్లతో పెరివేశారు. ఆ తరవాత చంద్రబాబు కూడా వరుసగా రెండుసార్లు సిఎం అయ్యారు. తమిళనాడులో ఎమ్.జి.రామచంద్రన్ అటువంటి వారిలో ఒకరు. ఆయన నేతృత్వంలోని అన్నాడిఎంకె తమిళనాడులో 1977-87 సంవత్సరాల మధ్య వరుసగా మూడుసార్లు అధికారంలోకి వచ్చింది. జయలలిత నేతృత్వంలో కూడా అన్నాడిఎంకె వరుసగా రెండుసార్లు ఎన్నికలలో విజయం సాధించింది. ఒడిషాలో నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజూ జనతాదళ్ 2000 సంవత్సరం నుంచీ వరుసగా ఐదు పర్యాయాలు నిరాఘాటంగా సాగుతోంది. గుజరాత్ 1998 నుంచి భారతీయ జనతా పార్టీయే అధికారంలో ఉంటూ వస్తోంది. మొన్నటి ఎన్నికల్లో మరోమారు తిరుగులేని అధికారన్ని నిలబెట్టుకుంది. కొందరి నాయకుల పట్ల ప్రజల్లో సానుకూలత ఏర్పడుతుంది. కెసిఆర్ ప్రాంతీయ పార్టీని పెట్టి తెలంగాణ ఉద్యమంలో జైత్రయాత్ర చేశారు. వరుసగా రెండోసారి అధికారంలో కొనసాగుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత అనేది ఒక బలహీనతగా కాకుండా ఒక సానుకూల శక్తిగా పనిచేస్తున్నట్టు కనిపిస్తోంది. ఎన్నికలలో ప్రజలు ఓటు వేస్తున్న తీరు తెన్నులను అధ్యయనం చేసే సెఫాలజిస్టు ఇలా ఎందుకు జరుగుతుందో పసిగట్టడం లేదు. వ్యతిరేకతలో కూడా కొందరు విజయం సాధిస్తున్నారు. ఇటీవల గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ శాసనసభా ఎన్నికలు, ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే ప్రజల అభిప్రాయాలు మారుతున్నాయని గమనించాలి. దీనికితోడు రాజకాయ పార్టీలు ప్రజల సంక్షేమం పక్కన పెట్టి వచ్చే ఐదేళ్ల తరవాత మళ్లీ అధికారంలోకి రావడమెలా అన్న ప్రణాళికతో పనిచేస్తున్నారు. అందుకు ఖజానాను ఊడ్చేస్తున్నారు. పథకాలతో ప్రజలకు గాలం వేస్తున్నారు. డబ్బుల పందేరంతో ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ పోకడలు విపరీతంగా ఉన్నాయి. అధికారంలో ఉన్న రాజకీయ పక్షాలు తమ ఐదేళ్ల పాలనలో, తదుపరి ఎన్నికలలో వ్యయాలకు గాను భారీ మొత్తాలలో నిధులు సమకూర్చుకుంటున్నాయి. ఎన్టీఆర్ లాంటి ఉద్దండులు కూడా గతంలో ఇలాంటి వాటి జోలికి పోలేదు. వారి పాలనలో అటువంటి వ్యవహారాలు జరిగేవి కావు. పాలక పక్షాలు ఉద్యోగులు, అధికారులను ముఖ్యంగా పోలీసు సిబ్బందిని తమ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటు÷-న తీరును మనం చూస్తున్నాం. వారికి ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, తదితర ఆశలతోఓ బుట్టలో వేసుకుంటున్నాయి. పదవీవిరమణ అనంతరం సలహాదారులుగా నియమించు కుంటున్నారు. అధికార దుర్వినియోగం సాధారణమై పోయింది. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఇలా పథకాల పేరుతో ఖజానాను సిఎం జగన్ ఊడ్చేశారు. డబ్బుల పందేరాన్ని అభివృద్ధిగా చూపుతున్నారు. ఓట్లను పరోక్షంగా ప్రభుత్వ ధనంతో కొనుగోలు చేస్తున్నారు. తెలంగాణలో కూడా ఇంచుమించుగా ఇదే ధోరణి కనినిస్తోంది. ఎన్నికల వ్యవహారాల సూక్ష్మ నిర్వహణకు, ముఖ్యంగా పోలింగ్ రోజున పోల్ మేనేజ్‌మెంట్ అన్నది ఇప్పుడు అన్ని పార్టీలు అనుసరిస్తున్న వ్యూహంగా మారింది. బీజేపీ, కాంగ్రెస్, ప్రాంతీయపార్టీలు అన్నీ ఇప్పుడు పోల్ మేనేజ్‌మెంట్ ఆధారంగానే ఎన్నికలకు వెళుతున్నాయి. సిద్ధాంతాలు, నిబద్దత, దేశాభివృద్ధి, పక్కకు పోయాయి. ప్రజలు కూడా తమకు ఎంత ముట్టచెప్పారన్నది ఆధారంగా ఓట్లు వేస్తున్నారు. అందుకు మొన్నటి మునుగోడు ఉప ఎన్నిక కూడా ఓ ఉదాహరణగా చెప్పుకోవాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

## బాలికపై యాసిడ్ దాడి

(మొదటి పేజి తరువాయి) యాసిడ్ పడి తీవ్రంగా కాలిన గాయాలయ్యాయని చెబుతూ ఉద్వేగానికి లోనయ్యారు. సమాచారమందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని బాధితురాలి నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. బాలిక ఇద్దరు వ్యక్తులపై అనుమానం ఉందని చెప్పడంతో వారిలో ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటనపై ఢిల్లీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ స్వాతి మాలివాల్ విచారం వ్యక్తం చేశారు. బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. "దేశంలో యాసిడ్‌ను నిషేధించాలని ఢిల్లీ మహిళా కమిషన్ ఏళ్లుగా పోరాడుతోంది. ప్రభుత్వాలు ఇంకెప్పుడు మేల్కొంటాయి" అని ఆమె మండిపడ్డారు.

## హస్తినాలో బీఆర్ఎస్

(మొదటి పేజి తరువాయి)సందర్భంగా పార్టీ శ్రేణులకు మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం కేసీఆర్.. దేశంలో గుణాత్మక మార్పు కోసం జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారని తెలిపారు. ఆనాడు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం విప్లవాత్మక పంథాను అనుసరించారో, ఇవాళ దేశహితం కోసం నూతన రాజకీయ ఒరవడిని కేసీఆర్ ప్రారంభిస్తున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక అనుమతితో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవానికి హాజరు కాలేకపోతున్నానని వెల్లడించారు. ముందే నిర్ణయించబడిన రెండు కీలకమైన పెట్టుబడి సమావేశాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సిరిసిల్లలో సెస్ ఎన్నికల నామినేషన్లు కూడా ఈ రోజే ఉన్నాయని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ హాజరుకాలేదు. బీఆర్ఎస్ పార్టీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన దూరంగా ఉంటున్నారు. జపాన్ బిజినెస్ వరల్డ్ లీడర్స్ తో సమావేశం ఉన్న నేపథ్యంలో కేటీఆర్ ఢిల్లీ పర్యటనను రద్దు చేసుకున్నారు. కాగా ఏపీలోనూ తమ సత్తా చాటాలని పట్టుదలతో ఉన్నారు. బీఆర్ఎస్ ఏపీ బాధ్యతలను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు అప్పగించినట్లు సమాచారం. సంక్రాంతికి ఏపీలో బీఆర్ఎస్ అడుగుపెట్టబోతోంది. ఈ సందర్భంగా అమరావతిలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. బహిరంగ సభ బాధ్యతలను కూడా తలసానికి కేసీఆర్ అప్పగించారు. ఏపీ మూలాలున్న హైదరాబాద్‌లోని ప్రముఖులతో కేసీఆర్ ఇప్పటికే పరిచయం పెంచుకున్నారు. జాతీయ పార్టీ అధికారిక గుర్తింపు కోసం తెలుగు ప్రజలు మెజారిటీగా ఉన్న రాష్ట్రాల్లో ముందుగా పోటీ చేయాలని కేసీఆర్ ప్లాన్ చేస్తున్నారు. తొలి దశలో ఏపీ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు.

## కాంగ్రెస్ ధర్నా ఉద్రిక్తత

(మొదటి పేజి తరువాయి) బారికేడ్లను పెట్టి పోలీసులు అడ్డుకున్నారు. పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే గాంధీభవన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలు నినాదాలు చేశారు. సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మను కాంగ్రెస్ నేతలు దహనం చేశారు. గాంధీభవన్ వద్ద కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ నాయకులు ధర్నా చేపట్టక ముందే తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వార్ రూంపై పోలీసుల దాడి నేపథ్యంలో ఒక ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు. తన ప్రకటనలో ఆయన "అధికారం ఉంది కదా అని టీఆర్ఎస్ ప్రభుత్వం ఇష్టనుసారంగా కొందరు పోలీస్ అధికారులతో ప్రజాస్వామ్యాన్ని భయభ్రాంతులకు గురి చేస్తుంది. మీరు అధికారం కోల్పోయిన రోజు ఇలాంటి పరిస్థితే మీకు వస్తే.. ఆ రోజు మీరు ఏ మొఖం పెట్టుకొని మాట్లాడగలుగుతారు..? ప్రజాస్వామ్య పద్ధతిలోనే కాంగ్రెస్ పార్టీ ఉద్యమలు, న్యాయ పోరాటం చేయడం జరుగుతుంది. కానీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే ప్రయత్నాలను తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తుంది. టీఆర్ఎస్ ప్రభుత్వానికి, కొంతమంది పోలీస్ అధికారులకు కాంగ్రెస్ పార్టీ నుంచి హెచ్చరిక" అని జగ్గారెడ్డి తెలిపారు. పోలీసుల ముసుగులో రౌడీలతో దాడులు చేశారని, ఫోన్ లు చేస్తే కనీసం లిఫ్ట్ చేయరని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకు చట్టాల పట్ల ప్రజాస్వామ్యం పట్ల నమ్మకం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల మీద దాడి ద్వారా తమ అధికారాన్ని పదిలం చేసుకోవడానికి రాజకీయ దాడి చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం వందలాదిమంది పోలీసుల తో కాంగ్రెస్ వార్ రూమ్ పై దాడి చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో వార్ రూంలో ఫర్నిచర్ ధ్వంసం చేసి, సిబ్బందిపై దాడి చేశారని నిప్పులు చెరిగారు. షబ్బీర్ అలీ, మల్లు రవి, అనిల్ కుమార్ యాదవ్ చాలామంది నాయకులపై మఫ్టీలో దాడి చేశారని ఆరోపించారు. వచ్చిన ఫిర్యాదు ఏవారంటూ ఏమీ చూపించకుండా దాడి చేశారని మండిపడ్డారు. పోలీసుల ముసుగు కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన డాటాను మొత్తం చోరీ చేశారని ఆరోపణ చేశారు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్ కార్యకర్తల డాటా అందులో ఉందని అన్నారు. రాష్ట్ర పోలీస్ అధికారులకు ఫోన్ చేసిన కనీసం స్పందించట్లేదని మండిడపడ్డారు. పార్లమెంటు సభ్యుడిగా ఫోన్ చేస్తే కనీసం లిఫ్ట్ చేయరని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర పోలీసులు పోలీసులా లేకపోతే దొంగలా అంటూ ప్రశ్నించారు రేవంత్. పోలీసులు కిరాయి గుండాల లాగ వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ పాదయాత్రకు మంచి స్పందన వస్తోందని అన్నారు. పాదయాత్రలో ఆయన లేవనెత్తుతున్న అంశాలు నచ్చకనే నరేంద్ర మోడీకి , కేసీఆర్ కి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ స్ట్రాటజీ టీం పై దాడి చేశారంటే.. రాహుల్ గాంధీ పాదయాత్రలో ఏం మాట్లాడాలో ఈ స్ట్రాటరి టీం చెప్తుందని రేవంత్ హెచ్చరించారు. హైదరాబాద్ కమిషనర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. ఈ అంశంపై పార్లమెంట్లో మాట్లాడుతాం.. ఈ అంశాన్ని జాతీయస్థాయిలో చర్చ జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కేసీఆర్ ఆగడాలను దేశ ప్రజలకు తెలియజేస్తామన్నారు. కాంగ్రెస్ ఎంపీ ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర పోలీసులు ఉల్లంఘించారని అన్నారు. కల్వకుంట్ల కవిత లిక్కర్ స్కాంలో ఇన్వాల్వ్ ఉందని దేశవ్యాప్తంగా అందరికీ తెలుసన్నారు. కవిత లిక్కర్ కేసులో ఇన్వాల్వ్ ఉందని ఒక ఫేస్బుక్ పోస్టు పెట్టామన్నారు. ఆ ఫేస్బుక్ పోస్టు వల్ల రాష్ట్ర పోలీసులకు ఏమి ఇబ్బంది కరం అని ఆయన ప్రశ్నించారు.

### దాడులకు నిరసనగా కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

**సునీల్ కనుగోల్ ఆఫీస్‌లపై దాడులను ఖండించిన కాంగ్రెస్ జిల్లా నాయకుడుం సురిగి నరసింహ గౌడ్**



**మునుగోడు, డిసెబర్ 14 (సమ సమాజం):** రాజకీయ వ్యూహకర్త కార్యాలయంలో పోలీసుల సోదాలు, అక్రమ అరెస్టులను నిరసిస్తూ టిపిసిసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు టీ పిసిసి రాష్ట్ర జనరల్ సెక్రటరీ చలమల్ల కృష్ణా రెడ్డి నాయత్వంలో సీఎం కెసిఆర్ దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకులు సురిగినరసింహ గౌడ్ మాట్లాడుతూ ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయకుండా ఆఫీసులపై దాడులు చేస్తూ ప్రజాస్వామ్య స్వేచ్ఛను అరిస్తున్న కెసిఆర్ కు రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్తామని అన్నారు ప్రభుత్వానికి వ్యతరేకంగా నినాదాలు చేశాం.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా , సీనియర్ నాయకులు పాల్వాయి చెన్నారెడ్డి, నిమ్మల స్వామి, కిష్టాపురం ఎంపీటీసి బీమనపల్లి సైదులు, నాయకులు మేకల శ్రీనివాస్ రెడ్డి, ముచ్చపోతుల నర్సింహా, ఆరేళ్ల సైదులు, దోటి వెంకటేశ్వర్లు, బోయపర్తి లింగయ్య, జాల నర్సింహా, మేక ప్రదీఫ్ రెడ్డి, బొజ్జ మల్లయ్య, నరేష్, నాగం నర్సిరెడ్డి, జనగాం రాము, జిట్టగోని మల్లేష్, దాసరి రాజు, గోవర్ధన్, మందుల అంజయ్య, నజీర్ బాబా, వేణు, దుబ్బ రాజమల్లు లు పాల్గొనటం జరిగింది..

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆశలు అడియాశలు

(మొదటి పేజి తరువాయి) కేంద్ర ప్రభుత్వం తాజాగా ఈ అంశంపై క్లారిటీ ఇచ్చేసింది. ఉద్యోగులకు ఈ 18 నెలల డీఏ బకాయిలను చెల్లించేది లేదని స్పష్టం చేసింది. నరేన్ భాయ్ జే రావత్ రాజ్య సభలో డీఏ బకాయిలపై కేంద్రాన్ని ప్రశ్నించారు. 18 నెలల డీఏ బకాయిలను ఉద్యోగులకు చెల్లిస్తుందా? లేదా? అని ప్రశ్న లెవనెత్తారు. దీనికి ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 18 నెలల డియర్‌నెస్ అలవెన్స్ బకాయిలను చెల్లించాలనే ప్రతిపాదనలు తమ వద్దకు వచ్చాయని తెలిపారు. 2020-21 ఆర్థిక సంవత్సరం తర్వాత కూడా పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నాయని ఆయన తెలిపారు. అందువల్ల డియర్‌నెస్ అలవెన్స్ బకాయిలను చెల్లించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ప్రతిపాదనను పరిగణలోకి తీసుకోలేదని పేర్కొన్నారు. 7వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం చూస్తే.. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండు సార్లు డియర్‌నెస్ అలవెన్స్‌ను పెంచాల్సి ఉంటుంది. ఆరు నెలలకు ఒకసారి డీఏ పెరుగుదల ఉంటుంది. అందుకే ప్రభుత్వం కూడా ఏడారికి రెండు సార్లు ఆరు నెలల చొప్పున డీఏను పెంచుకుంటూ వెళ్తోంది. అయితే కరోనా టైమ్‌లో మాత్రం డియర్‌నెస్ అలవెన్స్ పెరగలేదు. మూడు సార్లు స్థిరంగానే కొనసాగింది. అందుకే ఉద్యోగులు ఈ మూడు సార్లు పెంపును (18 నెలలు) బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు. అయితే ఇప్పుడు కేంద్రం ఈ విషయంపై స్పష్టత ఇచ్చేసింది. ఇక ఈ డీఏ బకాయిలు ఉద్యోగులకు రావు.

## 11,000లకు పైగా ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీ

**సెంట్రల్ యూనివర్సిటీలు, ఐఐటీ, ఐఐఎంలలో పోస్టులు**

**లోక్‌సభలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి**

**న్యూఢిల్లీ, డిసెబర్ 14 (సమ సమాజం):** దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీలు, ఐఐటీ, ఐఐఎంలలో 11,000లకు పైగా ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లిఖితపూర్వక సమాధానంలో ఈ మేరకు తెలిపారు. దేశంలో మొత్తం 45 సెంట్రల్ యూనివర్సిటీ ఉండగా.. వీటిల్లో 18,956 పోస్టులు మంజూరు చేశారు. మంజూరైన పోస్టుల్లో 6,480 ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని మంత్రి తెలిపారు. ఇక 23 ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లలో 11,170 పోస్టులు మంజూరు కాగా వీటిల్లో 4,502 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా దేశంలో ఉన్న మొత్తం 20 ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐటీలు)లలో 1,566 ఫ్యాకల్టీ పోస్టుల్లో 493 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా విద్యాసంస్థల్లో ఎస్సీ కేటగిరీలో 961 పోస్టులు, 578 ఎస్టీ పోస్టులు, 1657 ఓబీసీ పోస్టులు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 643, పీడబ్ల్యూడీలో 301 పోస్టులు ఖాళీగా ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. వాటిని భర్తీ చేయడం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ చట్టాల ప్రకారం ఏర్పాటైన ఈ సంస్థల్లో నియామక ప్రక్రియ యూజీసీ నిబంధనలకు అనుగుణంగానే జరుగుతుందని తెలిపారు.

## బీఆర్ఎస్ ఓ వైరస్, బీజేపీ ఓ వ్యాక్సిన్

### బండి సంజయ్‌ని ప్రశ్నిస్తూ ఫ్లెక్సీల ఏర్పాటు

**కరీంనగర్, డిసెబర్ 14 (సమ సమాజం):** తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కు ఊహించని సంఘటన ఎదురైంది. తాను గెలిచిన నియోజకవర్గంలోనే ఆయనపై ప్రజలు వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. ఐదో విడత ప్రజా సంగ్రామయాత్ర చేస్తున్న బండి సంజయ్‌ని ప్రశ్నిస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కరీంనగర్ జిల్లాలో పాదయాత్ర చేస్తున్న బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ జిల్లాకు, లోక్‌సభ పరిధిలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలంటూ రామడుగు మండలం వెదిరలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు గుర్తు తెలియని వ్యక్తులు. అంతే కాదు ఎంపీగా గెలిచిన తర్వాత కరీంనగర్ పార్లమెంట్‌కు ఎన్ని నిధులు తెచ్చారో..తెలంగాణబీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత కేంద్రం నుంచి రాష్ట్రానికి ఏం మేలు చేశారో చెప్పాలంటూ ప్రశ్నలు సంధిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై బీజేపీ జిల్లా నేతలు తలలు పట్టుకుంటున్నారు. వెదిరిలోని పలు కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. అంతే కాదు మరికొద్ది సేపట్లో పాదయాత్రగా బండి సంజయ్ వెదిరకు చేరుకోనుండటంతో టెన్షన్ వాతావరణం నెలకొంది.



(మొదటి పేజి తరువాయి) శిబిరం వద్ద ప్రెస్ మీట్ లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతి రోజు లాగే అధికార పార్టీపై బండి సంజయ్ మండిపడ్డారు. "నారాయణపూర్ రిజర్వాయర్ ముంపు నిర్వాసితులను ఎందుకు పట్టించుకోవడం లేదు? కొండగట్టు బస్సు ప్రమాద మృతుల కుటుంబాలను ఎందుకు ఆదుకోవడం లేదు? బీజేపీ కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దు. మేము ఫ్లెక్సీలు పెట్టడం మొదలుపెడితే మీరు ముఖం కూడా ఎత్తుకోలేరు. తెలంగాణ ప్రభుత్వం మారాలని ప్రజలంతా కోరుకుంటున్నారు. పైలట్ రోహిత్ రెడ్డితో హడావుడిగా ఎందుకు స్టేట్‌మెంట్ ఇప్పించారో సీఎం చెప్పాలి. బెంగళూరు, హైదరాబాద్ డ్రగ్స్ కేస్ వ్యవహారాన్ని విడిచిపెట్టబోం" తన ఎమ్మెల్యేలు కొందరు చేసిన తప్పుల చిట్టాను తన దగ్గర పెట్టుకొని వారిని సీఎం బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. నయీమ్ కేసు డ్రగ్స్ కేసులు వంటి వాటిపై గతంలో వేసిన సిట్ నివేదికలు ఏమయ్యాయి? ఇప్పుడు ఎందుకు హడావుడి చేస్తున్నావ్" అంటూ బండి సంజయ్ ప్రశ్నించారు. నారాయణపూర్ చెరువు ముంపు గ్రామాల బాధితుల సమస్యలు వినడంతోపాటు.. వివిధ వర్గాల ప్రజలతో బండి సంజయ్ మమేకం కానున్నారు. ఈ పాదయాత్రలో బండి సంజయ్ కురిక్యాల, కోట్ల నరసింహుల పల్లె, కొండన్నపల్లి, దేశరాజు పల్లి, వెదిర మీదుగా కొత్తపల్లి చేరుకోనున్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అయిదవ విడత ప్రజా సంగ్రామ యాత్ర రేపటితో ముగియనుండడంతో పెద్ద ఎత్తున రాష్ట్ర నాయకులు కరీంనగర్ కి చేరుకుంటున్నారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సభకు హాజరు కానుండడంతో భారీ జన సమీకరణ చేసి సక్సెస్ చేయడం ద్వారా టిఆర్ఎస్ కి సవాల్ విసరాలనీ బిజెపి భావిస్తోంది. కరీంనగర్ లోని ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో ముగింపు సభ జరగనుంది.

## దళితబంధుకు పెరుగుతున్న డిమాండ్

**ప్రతి గ్రామంలోనూ ఆశావహుల ఎదురుచూపు ● నిధుల కొరతతో అరకొరగా పంపిణీ**

**నిజామాబాద్, డిసెబర్ 14 (సమ సమాజం):** దళిబంధుకు ఇప్పుడు డిమాండ్ పెరిగింది. ఉచితంగా పదిలక్షలు ఇస్తుండడంతో గ్రామాల్లో నిరుద్యోగులుగా ఉన్న దళితులు తమకు ఈ పథకం కావాలని డిమాండ చేస్తున్నారు. ఇలా ఒక్క నిజామబాద్ జిల్లాలోనే వేలాదిమంది పథకం కోసం ఎదురు చూస్తున్నారు. నిరుపేదలైన ఒక్కో దళిత కుటుంబానికి మూడు ఎకరాల చొప్పున భూమి ఇవ్వాలని నిర్ణయించిన పథకం దాదాపుగా ఆగిపోయింది. సిఎం కెసిఆర్ ఇప్పటికే భూమి లేదన్న సంకేతాలు ఇచ్చారు. దీంతో ఈ పథకం అటకెక్కింది. అందుకే కొత్తగా వచ్చిన దళితబందు కోసం ఆశగా ఉన్నారు. భూమిపై ఆశలు పెట్టుకున్న ఎందరో దళిత రైతులకు నిరాశే మిగిలింది. వేళ్లమీద లెక్కించే విధంగా లబ్దిదారులకు భూ పంపిణీ జరిగింది. మొత్తంగా దళితుల భూ పంపిణీ అన్నది ఇక లేనట్లుగానే భావించాల్సిందే. దీనిని ఎందుకు పక్కనపెట్టారో చెప్పాలిన బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడం ముందు నేర్చుకోవాలన్నారు. కేంద్రాన్ని విమర్శించే ముందు హామలు నెరవేర్చాలన్నారు. దళితుల భూ పంపిణీపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో నిధులు కేటాయించకపోవడంతో కార్యక్రమం నీరుగారింది. భూముల ధరలకు రెక్కలు రావడం కూడా ఓ కారణంగా చూడాలి.

## శరవేగంగా నగరాభివృద్ధి




**హైదరాబాద్, డిసెబర్ 14 (సమ సమాజం):** హైదరాబాద్‌లో బోష్ కంపెనీ స్మార్ట్ క్యాంపస్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. మౌళిక వసతుల విషయంలో హైదరాబాద్ నగరం వెనుకబడి లేదని కేటీఆర్ అన్నారు. నగరాభివృద్ధికి సీఎం కేసీఆర్ కట్టుబడి ఉన్నారని, అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్ నగరంలో గత ఏడాదిన్నర కాలంలో లక్షన్నర ఉద్యోగాలు కల్పించామని మంత్రి తెలిపారు. అత్యధిక వృద్ధి సాధించిన రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రం నుంచి ఐటీ ఎగుమతులు భారీగా పెరిగాయని మంత్రి తెలిపారు. భారతదేశంలోని మూడో వంతు ఉద్యోగాలు హైదరాబాద్‌లోనే ఉన్నాయని చెప్పారు. బోష్ అతిపెద్ద కంపెనీ, సాఫ్ట్‌వేర్ కొత్త యుగం మొబైల్‌లు, కార్లలో అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ఆటోమోటివ్ రంగంలో బోష్ మరింత రాణిస్తుందని ఆశిస్తున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. మొబిలిటీ వ్యాలీని రూపొందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. క్వాల్‌కామ్ లాంటి సెమీకండక్టర్ కంపెనీలు హైదరాబాద్‌లో దూసుకుపోతున్నాయి. ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో ఫార్ములా-ఇ నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. భారతదేశంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తొలి నగరం హైదరాబాద్ అని ఆయన పేర్కొన్నారు. ఈవీవీ సమ్మిట్‌ను ప్రతి సంవత్సరం నిర్వహించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా తెలంగాణకు చెందిన కళ్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్(కేఆర్ఏఎస్) సంస్థ.. భారతీయ రక్షణ దళాలకు మిస్సైళ్లను అందచేస్తున్నది. సుమారు వంద మిస్సైల్ కిట్స్‌ను ఇండియన్ ఆర్మీకి కళ్యాణి సంస్థ ఇస్తున్నది. ఇండియాలో తొలిసారి క్షిపణులను ఉత్పత్తి చేస్తున్నారు. అది కూడా హైదరాబాద్ అడ్డాగా క్షిపణులను తయారీ చేయడం విశేషం. ఈ నేపథ్యంలో మంత్రి కేటీఆర్ స్పందించారు. తెలంగాణకు చెందిన కళ్యాణి సంస్థ .. భారతీయ ఆర్మీకి మిస్సైల్ కిట్స్ అందించడం గర్వంగా ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. ఆయన తన ట్విట్టర్‌లో ఇవాళ ఓ పోస్టు చేశారు. రక్షణ రంగంలో హైదరాబాద్ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. బాబా కళ్యాణ్ జీకి తన ధన్యవాదాలు అంటూ మంత్రి కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ంం



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in